## ముమ్మరంగా వాహనాల తనిఖీ



బాన్సువాడలోని తాడ్కోల్ రోడ్డులో వాహనాలను తనిఖీ చేస్తున్న పట్టణ సీఐ మహేందర్‌రెడ్డి

బాన్సువాడ, అక్టోబర్ 19 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల్లో బంగారం, డబ్బులు తీసుకెళ్తే వాటికి సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని పట్టణ సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. బాన్సువాడలోని బీర్కూర్, కొయ్యగుట్ట, తాడ్కోల్ రోడ్డు చౌరస్తాలో పోలీసులు గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాహనాల్లో రూ.50 వేలకు పైబడి తరలిస్తే ఆ డబ్బును ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులకు అప్పగించి, సంబంధిత ధ్రువపత్రాలను చూపితే వారి డబ్బులను వాపస్ ఇస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సీఐ సూచించారు.

## రేపు బీఎల్ఎఫ్ పార్టీ కార్యాలయం ప్రారంభం



బీబీపేట్‌లో మాట్లాడుతున్న బీఎల్ఎఫ్ కామారెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాద సిద్ధరాములు

బీబీపేట్, అక్టోబర్ 19 : మండలంలోని మల్కాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీఎల్‌ఎఫ్ పార్టీ కార్యాలయాన్ని శనివారం ప్రారంభిస్తున్నట్లు బీఎల్‌ఎఫ్ (బహుజన లెఫ్ట్ ఫ్రంట్) కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాద సిద్ధరాములు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21వ తేదీన మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఉదయం 9 గంటలకు ప్రచారం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు వడ్ల సాయికృష్ణ, దోమకొండ మండల కన్వీనర్ రాజశేఖర్, బీబీపేట్ మండల కన్వీనర్ చంద్రకాంత్ రెడ్డి, నాయకులు నాంపల్లి, సిద్ధరాములు, స్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలి

**శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, అక్టోబర్ 19 : పోలింగ్ నిర్వహణ, ఈవీఎంలపై అవగాహన పొందిన మాస్టర్ ట్రైనీలు నియోజకవర్గ స్థాయిలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మాస్టర్ ట్రైనీలు, నోడల్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పిస్తూ ఓటింగ్ మెషిన్‌లోని వివిధ అంశాలపై ట్రైనర్లకు వివరించారు. శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనీలు నియోజకవర్గాల్లో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ సజావుగా నిర్వహించేలా ఈవీఎంల నిర్వహణపై అవగాహన కలిగించడంతోపాటు అనుసరించాల్సిన విధానాలు, పోలింగ్ అనంతరం చెక్ లిస్ట్ ప్రకారం అందజేసే వివిధ పత్రాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారి రఘునందన్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## పోచారాన్ని భారీ మెజార్టీతో గెలిపించాలి



బోర్లంలో బూత్‌లెవల్ నాయకుల వివరాలను స్వీకరిస్తున్న మండల అధ్యక్షుడు మోహన్ నాయక్

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 19 : బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిగా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కారుగుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్ కార్యకర్తలను కోరారు. మండలంలోని హన్మాజీపేట్, కోనాపూర్, బోర్లం గ్రామాల్లో గురువారం బూత్ లెవల్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన పోచారం శ్రీనివాసరెడ్డికి ప్రజలు అండగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మ్యానిఫెస్టో, ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు.

బూత్‌ల వారీగా ఎంపిక చేసిన పార్టీ నాయకుల వివరాలను గ్రామ శాఖ అధ్యక్షుల నుంచి స్వీకరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నెర్రె నర్సింహులు, పార్టీ మండల కార్యదర్శి రాజేశ్వర్ గౌడ్, సర్పంచ్ బోనాల సుభాష్, డీసీసీబీ డైరెక్టర్ సంగ్రాం నాయక్, ఎంపీటీసీ సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, గోపన్‌పల్లి సాయిలు, దేవేందర్‌రెడ్డి, పుట్టి లక్ష్మణ్, ఆనంద్, అమీన్, మోహన్‌రెడ్డి, మన్నెచిన్న సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



సిద్ధరామేశ్వరాలయాన్ని దర్శించుకున్న దేవాదాయ శాఖ రీజినల్ డైరెక్టర్ కృష్ణారావు

భిక్కనూరు, అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని సిద్ధరామేశ్వర స్వామి ఆలయ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ రీజినల్ డైరెక్టర్ కృష్ణారావు గురువారం పరిశీలించారు. ఆయన గురువారం కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఈవో శ్రీధర్, అర్చకులు సిద్దగిరి శర్మ, రాజేశ్వర్‌శర్మ, సిబ్బంది లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేరాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం



కోళ్ల ఫారంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు

బీబీపేట్, అక్టోబర్ 19 : నేరాలకు పాల్పడిలే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు అన్నారు. గురువారం బీబీపేట్ మండలంలోని మల్కాపూర్, తుజాల్‌పూర్, సీతారాంపల్లి గ్రామ శివారులోని కోళ్ల ఫారాల్లో, అనుమానాస్పద ప్రాంతాలపై దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చి అమ్మినచో పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామంలో కల్లు దుకాణాన్ని పరిశీలించామన్నారు. ఎలాంటి మత్తు పదార్థాలు దొరకలేవన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై శ్రావణ్‌కుమార్, కానిస్టేబుళ్లు జీవన్, శ్రీనివాస్, మహేశ్‌బాబు పాల్గొన్నారు.



ఉప్పర్‌పల్లిలో కల్లు దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

# కొనసాగుతున్న దేవీ నవరాత్రి ఉత్సవాలు



దేవి విహార్‌లో రూ.2,12,111 నోట్లతో అలంకరణ



కామారెడ్డిలోని శారదాదేవి ఆలయంలో నవదుర్గావ్రతం నిర్వహిస్తున్న మహిళలు



రాజంపేటలో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి/కామారెడ్డి రూరల్/బాన్సువాడ టౌన్/ భిక్కనూరు/రాజంపేట్, అక్టోబర్ 19 : కామారెడ్డిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శారదాదేవి, సంకష్టహర గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవి విహార్‌లోని దుర్గామాతకు రూ.2,12,111 నోట్లతో అలంకరణ చేశారు. అమ్మవారిని లలితా త్రిపుర సుందరిగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. కామారెడ్డి మండల కేంద్రంలోని దేవునిపల్లి లో దుర్గామాత మండపం వద్ద పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాన్సువాడలోని జ్ఞానసరస్వతి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదోరోజు మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భిక్కనూరులోని శ్రీరాం నగర్ కాలనీలో దుర్గామాత మండపం వద్ద దుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. శ్రీదుర్గా సేవా సమితి సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. రాజంపేటలో నవదుర్గా సేవ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దుర్గాదేవి నవరాత్రులను పురస్కరించుకొని దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నవదుర్గా సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.